క్లుప్తంగా

వృద్ధురాలిపై లైంగిక దాడి

పెదనందిపాడు: వృద్ధురాలపై గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడి చేసినట్లు పెదనందిపాడు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వివరాల మేరకు నాగులపాడు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటిలో నిద్రిస్తున్న సుమారు 85 సంవత్సరాల వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. ఆమెను ఇంటి బయటకు ఈడ్చుకెళ్లి అత్యాచారం చేసి, అక్కడి నుంచి పరారయ్యాడు. శనివారం వృద్ధురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డెప్యూటీ తహసీల్దారుగా శాంతిలక్ష్మి



పెదనందిపాడు: పెదనందిపాడు డెప్యూటీ తహసీల్దారుగా ఎ.శాంతిలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో గుంటూరు కలెక్టరేట్‌లో పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెదనందిపాడుకు వచ్చారు. తహసీల్దారు సుభానీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతి లక్ష్మి మాట్లాడారు. సిబ్బంది సహకారంతో రెవెన్యూ శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

కారు ఢీకొని సైక్లిస్ట్ మృతి



గుంటూరు రూరల్: మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీ కొన్న ప్రమాదంలో అతను మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతంలో నివశించే పానుగంటి నాగఫణీంద్ర(38) సైకిల్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో కొండపాటూరు గ్రామానికి చెందిన అద్దంకి శ్రీకాంత్ మద్యం మత్తులో కారును మితి మీరిన వేగంతో నడుపుతూ ఫణీంద్రను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫణీంద్రకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు అతనిని తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫణీంద్ర మృతి చెందాడు. ప్రమాదంపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా

వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ అంజన్ కర్నాటి

మంగళగిరి: వైఎస్సార్ నేతన్న నేస్తంతో రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని, నేతన్న నేస్తం ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ అంజన్ కర్నాటి అన్నారు. వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ప్రపంచ చేనేత సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి కొరకు ప్రభుత్వంలో చేనేతలను భాగస్వాములు చేయడంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు ఎమ్మెల్సీలు, ఆప్కో చైర్మన్, వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్లుగా నేతన్నలను నియమించడం ప్రశంసనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధి రమేష్ మునుకుంట్ల, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

ముగిసిన కూచిపూడి నృత్య శిక్షణ తరగతులు

మంగళగిరి: నగరానికి చెందిన శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గత ఏడాది కాలంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు నాట్యాచార్య సప్ప శివకుమార్ తెలిపారు. నృత్యంలో శిక్షణ పొందిన తీర్థశ్రీ, బిందు ప్రియ, భావన, హారిక, హిమ వర్షిణి, తేజశ్రీ సాయిలతో నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గజ్జె పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఆగస్టు 14వ తేదీన అరుణాచలంలో జరిగే నృత్య ప్రదర్శనకు శిక్షణ పొందిన విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాట్యాచారిణి గోసిక బేబి వెన్నెల పాల్గొన్నారు.

మహిళల యోగా శిక్షణ శిబిరం ముగింపు

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళల యోగ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరంలో ముగింపు సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు మేడూరు శ్రీనివాసమూర్తి బెజ్జ మహాదేవి కథను వివరించారు. ఈ సందర్భంగా ఆయనను కిషోర్ గురూజీ, యోగా సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, కోమల మాతాజీ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

పల్లె పల్స్ పట్టిన ప్రభుత్వం

- విలేజ్ క్లినిక్‌లు, అర్బన్‌హెల్త్ సెంటర్‌ల ద్వారా మెరుగైన వైద్యం
- అత్యాధునిక వసతులతో.. పెరిగిన ఓపీ
- ప్రతి రోగిపై ప్రత్యేక దృష్టి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు
- కార్పొరేట్‌కు తీసిపోని వైద్య సేవలు



అడవితక్కెళ్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత(ఫైల్)

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రతను కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి చరిత్ర సృష్టించారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ తోపాటు ప్రతి గ్రామంలో, డివిజన్ పరిధిలో వైద్యశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నారు.

వేగంగా విలేజ్‌క్లినిక్‌ల నిర్మాణం..



గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ప్రతి గ్రామంలో 6 పడకలతో నూతనంగా నిర్మిస్తున్నారు. తురకపాలెం, జొన్నలగడ్డ, మల్లవరం, చిన్నపలకలూరు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెంలో రెండు, ఓబులునాయుడుపాలెం, లాలుపురం ఇలా 8 గ్రామాల్లో ఇప్పటికే విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఆసుపత్రులు ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. తురకపాలెంలో విలేజ్ క్లినిక్ నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా అర్బన్ హెల్త్ సెంటర్‌లు రెడ్డిపాలెం, గోరంట్ల, అడవితక్కెళ్ళపాడు, పెదపలకలూరు పీహెచ్‌సీ, జన్మభూమి నగర్, నల్లపాడు, ఏటుకూరు ఇలా 8 గ్రామాల్లో 6 పడకలతో నూతనంగా ఒకొక్క ఆసుపత్రిని కోట్ల రూపాయలతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

మెరుగైన సౌకర్యాలు..పెరిగిన ఓపీ సేవలు

ప్రతి రోజు ఒక్కో ఆసుపత్రిలో సుమారు 30-50 మంది రోగులు నిత్యం వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతి వైద్యశాలలో మొత్తం 64 రకాల వైద్య సేవలు 24 గంటలూ అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటున్నారు. ప్రతి ఆసుపత్రిలో ప్రజల ఆరోగ్య రక్షణకోసం సుమారు 170కి పైగా మందుల రకాలను అందుబాటులో ఉంచారు. రోగుల అవసరాన్ని బట్టి వారికి మందులు అందజేయటం జరుగుతోంది. ల్యాబ్, ఆపరేషన్ ఎక్విప్‌మెంట్స్, ఆపరేషన్ థియేటర్, లాబర్, ఫార్మసీ గదులతో ఆసుపత్రుల నిర్మాణం జరిగింది. ప్రతి ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు అన్ని ఈ ఆసుపత్రుల్లో అందిస్తున్నారు. ఒక్కొక్క ఆసుపత్రికి ఇద్దరు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లు, నైట్ వాచ్‌మెన్, ఒక ఫిమేల్ నర్స్ అసిస్టెంట్ తదితర పోస్టులు నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలు అందించి, వారికి ఆరోగ్య భద్రత కల్పించనున్నారు.

ఆన్‌లైన్లో రోగి వివరాలు..

ప్రస్తుతం ఓపీ సేవలు ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. ఈ విధంగా రోగి పేరు, ఆధార్ నంబరు నమోదు చేస్తారు. రోగి ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి అతను పొందిన సేవలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అదేవిధంగా మరోసారి అదే రోగి ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలంటే అతని ఆధార్ నంబరు నమోదు చేయగానే ఆ రోగి గతంలో తీసుకున్న వైద్య సేవలు, అతనికి వైద్యులు ఇచ్చిన మందులు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. దీంతో మరోసారి రోగి సంప్రదించినపుడు వెంటనే అతని పరిస్థితి తెలుసుకుని, వైద్యులు సులువుగా చికిత్స చేసేందుకు వీలుంటుంది.

ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. అర్బన్ హెల్త్ సెంటర్‌లు, విలేజ్ క్లినిక్‌ల పేరుతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తోంది. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. భవిష్యత్తులో రోగికి వైద్య సేవలు అందించేందుకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి ఇంటికి వైద్యులు వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టే దిశగా కృషిచేస్తున్నాం.

– ఎం.ఝాన్సీబాయి, వైద్యురాలు, పెదపలకలూరు పీహెచ్‌సీ.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

భట్టిప్రోలు: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం పండుగ వేడుకలను శనివారం మండలంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా పండుగ నిర్వహించుకున్నారు. పీర్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పీర్లను దర్శించుకుని, మత పెద్దల సూచన ప్రకారం ప్రార్థనలు చేశారు. రెండు రోజుల క్రితం నిప్పుల గుండంలో తిరగడానికి పీర్లను అందంగా అలంకరించారు. పీర్ల చావిడి వద్ద ప్రార్థనలు జరిపారు. మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ పండుగను పీర్ల పండుగ అని కూడా అంటారు.



భట్టిప్రోలులో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

కృష్ణమ్మ కోత..

వరదలతో కోతకు గురవుతున్న పంట భూములు



ఓలేరు పల్లెపాలెంలో నివాస గృహాల వద్దకు చేరిన వరదనీరు

భట్టిప్రోలు: కృష్ణమ్మ బిరబిరమంటూ పరవళ్లు తొక్కుతుంటే..కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల రైతుల ఆందోళన చెందుతున్నారు. గత నాలుగైదేళ్లుగా ఏటా వరదలు గ్రామాలను ముంచెత్తుతున్నాయి. కృష్ణా నదిలో వరదలు వచ్చినప్పుడు మండలంలోని ఓలేరు పల్లెపాలెం పక్కనే ఉన్న రేవుకు వరద నీరు వస్తుంది. దీంతో పంట భూములు కోతకు గురవుతున్నాయి. వరదల కారణంగా పంట భూములు రేవులో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెపాలెం వద్ద పది మంది రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూమి ఉండగా అది నేడు 15 ఎకరాలకు చేరిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అవగతమవుతుంది. పెదపులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతుల పంట పొలాల్లో పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వరుసగా వరదలు రావడంతో రేవుని ఆనుకుని ఉన్న భూములు పటిష్టతను కోల్పోయి కోతకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. అలాగే పల్లెపాలెంలోని రేవు అంచున నివాస గృహాలు కూడా కోతకు గురవుతున్నాయి. వరదల ప్రభావం లేకపోతే భూములకు దన్నుగా చెట్టు, చేమ పెరిగి పటిష్టంగా ఉంటాయని చెబుతున్నారు.

శాంతించిన కృష్ణమ్మ

వరదల కారణంగా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ శనివారం శాంతించడంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాల కారణంగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు వరద ముంపనకు గురయ్యాయి. ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకుల డొంక వద్ద వరద నీరు వెనుకకు మళ్లింది. ఓలేరు పల్లెపాలెం వద్ద శుక్రవారం 9 అడుగుల మేర వరద నీరు ప్రవహించగా శనివారం 6 అడుగులకు చేరింది. పరిస్థితిని వీర్వోలు మంద్రు జక్రయ్య, ఎస్.రాంబాబు, వీఆర్ఏలు సమీక్షించారు.



ఓలేరు పల్లెపాలెంలో కోతకు గురైన పసుపు పంట పొలం



తగ్గిన వరద ప్రవాహం

సూపర్ కిడ్ అవార్డ్‌కు పల్లెకోన చిన్నారి ఎంపిక

భట్టిప్రోలు: లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా, లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న జాతీయ పురస్కార వేడుకల్లో సూపర్ కిడ్ అవార్డ్‌ను మండలంలోని పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు కైతేపల్లి షాలేమ్‌రాజు-జ్యోత్స్న దంపతుల కుమారుడు యశ్వన్‌రాయ్ అందుకోనున్నాడు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి తెలంగాణ సారసత్ పరిషత్ వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 40 మందికి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. సూపర్ కిడ్-2023 అవార్డ్‌ను కైతేపల్లి యశ్వన్‌రాయ్ అందుకోనున్నాడు. ఈ మేరకు నిర్వాహకులు బుచ్చేశ్వరావు-వసుంధర ఉత్తర్వులు పంపారు. చిన్నారుల్లో ఉండే ప్రతిభను వెలికి తీసేందుకు లిటిల్ చాంప్స్ అకాడమి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి పట్టణ చెంచుపేటలోని ఓ ఇంట్లో జూదం జరుగుతుందన్న సమాచారంతో త్రీటౌన్ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 17500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.

గౌతమ బుద్ధా రోడ్డులో ఆంబోతుల బీభత్సం

వృద్ధురాలికి గాయాలు

మంగళగిరి: నగరంలోని ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డుపై శనివారం రాత్రి రెండు ఆంబోతులు బీభత్సం సృష్టించాయి. వాహనదారులను భయభ్రాంతులకు గురి చేశాయి. అదే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై పొడుచుకుంటున్న ఆంబోతులను చూసి దూరంగా తన ద్విచక్ర వాహనాన్ని ఆపేసినా ఆంబోతులు ఒక్కసారిగా పొడుచుకుంటూ వెళ్లి ద్విచక్ర వాహనంపై పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి వెనుక కూర్చొన్న వృద్ధురాలికి గాయాలయ్యాయి. రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ఆటోపై పడటంతో ఆటో అద్దం ధ్వంసమైంది. నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భార్యను వేధిస్తున్న భర్త అరెస్ట్


తెనాలిరూరల్: భార్యను వేధిస్తున్న భర్తను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తెనాలి మండలం ఎరుకలపూడికి చెందిన లక్ష్మీబిందుకు 2021లో నరసరావుపేట మండలం బరంపేటకు చెందిన కఠారి చంద్రతో వివాహమైంది. సంతానం కలగడంలేదని, ఇతర కారణాలతో భార్యను తరచూ మానసిక, శారీరక హింసలకు గురి చేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంటేశ్వర్లు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

వ్యాధుల నివారణపై కరపత్రాలు విడుదల



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కరపత్రాన్ని విడుదల చేశారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి మాట్లాడుతూ మనం తినే ఆహార పదార్థాలు, తాగే నీటి మీద జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజు 40 నిమిషాలు వ్యాయామం, నడక, ధ్యానం చేయాలని కోరారు. వర్షాకాలంలో వచ్చే ముఖ్యమైన వ్యాధులలో అతిసారం, డెంగీ, మలేరియా, మెదడు వాపు వ్యాధి మొదలైన వ్యాధులపై అవగాహన పెరగడానికి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవడానికి ఈ కరపత్రం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వరరావు, కుర్రా నాగయ్య, చెన్ను కృష్ణప్రసాద్, బలుసుపాటి ఎల్లయ్య, సైమన్ కిషోర్, ఎల్.వెంకటేశ్వరరావు, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం



తెనాలి: రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ, హ్యాపీ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. హాస్పటల్‌లో ఏర్పాటైన సభలో పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ వాతావరణ మార్పులతో పిల్లలు, పెద్దల్లో వచ్చే మార్పులను వివరించారు. విరోచనాలు, జ్వరం, నోరు తడారిపోవటం, మూత్రం తక్కువగా వస్తూ, రంగు మారిపోవడం, వాసన రావడం, చర్మం పొడిబారటం, కళ్లు తిరగటం, స్పృహ కోల్పోవటం, గుండె అతివేగంగా కొట్టుకోవటం వంటి లక్షణాలు గుర్తించిన వెంటనే ప్రపంచ ఆరోగ్య సంస్థచే గుర్తింపును పొందిన ఓఆర్ఎస్‌ను ముందుగా తాగించాలని సూచించారు. అప్పటికీ ఏ మార్పులు కనిపించకపోతే, దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ, వర్షాకాలం సీజనులో వచ్చే వ్యాధులపై అవగాహన కోసం సదస్సును ఏర్పాటుచేసినట్టు చెప్పారు. హ్యాపీ హాస్పటల్ సిబ్బంది నందు, సాంబయ్య, నాగరాజు, పూజ, అను, లక్ష్మి, డాక్టర్లు ఉష, అశోక్, సత్యనారాయణ, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్న ధూళిపాళ్ల

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి చేయకుండా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అడ్డుపడుతున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. ఆయన చరిత్ర హీనుడిగా నిలిచిపోతారని మండిపడ్డారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కిలారి మాట్లాడారు. నిరంతరం ప్రజలను మభ్యపెట్టి, మోసగించటం ధూళిపాళ్లకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ప్రజలను మోసం చేస్తూ, నిరంతరం దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం లేదని అసూయ ద్వేషాలతో రగిలిపోతూ ప్రతి అభివృద్ధి పనికి ఆటంకం సృష్టిస్తూ.. రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. ధూళిపాళ్ల దుశ్చర్యలను పొన్నూరు పట్టణ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్తారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నిప్పులు చెరిగారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, రుద్రపాటి ఆదిశేషు, ఇందేటి వెంకటసుబ్బయ్య, దేవరకొండ గోపీ, గేరా సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు, క్రిస్టియన్ సంఘస్థులు

కాకుమాను: మణిపూర్‌లో ఇటీవల గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, గ్రామంలో ఊరేగించిన వారిని కఠినంగా శిక్షించాలని మండల ఫాస్టర్స్ అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం కాకుమానులో అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి యుతంగా సోదరభావంతో జీవించాలని బోధించే క్రైస్తవులపై ఇలాంటి దాడులు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఘటనకు గల కారణాలను తెలుసుకుని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామంలో ర్యాలీ అనంతరం తహసీల్దారు ప్రసాదరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్‌లు, ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో కత్తిపద్మారావు, ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: కవి, దళిత యోధుడు డాక్టర్ కత్తి పద్మారావు 70వ జన్మదిన వేడుకలు పొన్నూరులో శనివారం ఘనంగా జరిగాయి. జన్మదినోత్సవాల్లో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. కత్తి పద్మారావు స్ఫూర్తితో, వారి ఆశయాలు కొనసాగించేలా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు కుల నిర్మూలన దినోత్సవంగా జరుపుకోవటంపై ఎమ్మెల్యే కిలారి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి



కొల్లి వెంకట సుబ్బమ్మ (ఫైల్)

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమికి చెందిన శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలు కొల్లి వెంకటసుబ్బమ్మ (101) శనివారం మృతి చెందారు. గత ఫిబ్రవరి 1న ఆమె జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా జరిపారు. పదేళ్ల చిరు ప్రాయంలోనే అదే గ్రామానికి చెందిన అవుతు రమణారెడ్డితో ఆమె వివాహం జరిగింది. కొద్ది రోజులకే భర్త కబడ్డీ ఆడుతూ మరణించారు. అనంతరం దుగ్గిరాలలో 8వ తరగతి వరకు చదివిన వెంకటసుబ్బమ్మ.. 1951లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1953న నరసాపురంలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అదే ఏడాది దుగ్గిరాల మండలం మంచికలపూడిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విద్యాబోధన ప్రారంభించారు. అనంతరం అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలో 1955లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి 23 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం తన సోదరుడు కొల్లి సుబ్బారెడ్డి దగ్గరే ఉంటున్న వెంకటసుబ్బమ్మ మరణించే వరకు కూడా ఎవరి సాయం లేకుండా.. తన పనులు తానే చేసుకుంటున్నారు.

గీతా జ్ఞాన మందిరంలో అర్ధ ఏకాహం



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలోని గీతాజ్ఞాన మందిరంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం 4వ హరే రామ హరే కృష్ణ అర్ధ ఏకాహం నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. గీతా గురూజీ పందిరి శ్రీశైలం దివ్య ఆశీస్సులతో 12 నెలలు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంకల్పించారు. సామూహిక హారతితో కార్యక్రమం ముగిసింది. వెల్లటూరు, తాతావారిపాలెం, చినపులివర్రు, పెసర్లంక, కిష్కిందపాలెం గ్రామాలకు చెందిన భజన మండళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మందిరం నిర్వాహకురాలు వేములపల్లి వనజాక్షి పర్యవేక్షించారు.



